సాక్షి శ్రీకాకుళం

శనివారం । 18 । మార్చి । 2023



గురుకులం పిలుస్తోంది

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు ఉన్నాయి. - IIలో



మహిళలు ధైర్యంగా..

మహిళలు ధైర్యంగా వ్యవహరించాలని నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. టెక్కలిలోని డిగ్రీ కాలేజీకి ఆమె వచ్చారు. - IIలో



రెండు చోట్ల పిడుగుపాటు

జిల్లాలో రెండు చోట్ల పిడుగులు పడ్డాయి. ఈ పిడుగు పాట్లకు రెండు ఆవులు బలైపోయాయి. - IIలో

న్యూస్‌రీల్

ఇది సామాన్యుల సంక్షేమ బడ్జెట్



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: సామాన్యుల జీవితాల్లో ప్రగతికాంతులు నింపే సంక్షేమ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు బాగా చేశారని అన్నారు. వంశధారకు రూ.180 కోట్లు, మహేంద్రతనయపై ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూ.60 కోట్లు, ట్రిపుల్ ఐటీకి రూ.130 కోట్లు, అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి రూ. 7.5 కోట్ల నిధులు కేటాయించారని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి దోహదం చేసే ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టే సమయంలో ప్రతిపక్ష నాయకులు ప్రవర్తించిన తీరు చాలా బాధాకరమని ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం లేక అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారని విమర్శించారు.

జిల్లా బీసీ సంక్షేమాధికారికి చార్జిమెమో

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇ.అనురాధకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ.అర్జునరావు చార్జిమెమో జారీ చేశారు. ఆమెతో పాటు టెక్కలి సహాయ బీసీ సంక్షేమాధికారి టి.త్రినాథరావుకు కూడా చార్జిమెమో ఇచ్చారు. టెక్కలి మండలం పోలవరం బీసీ సంక్షేమ వసతి గృహం అధికారి తాలాడ అప్పారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులకు సిఫారసు చేశారు. ఇటీవల టెక్కలి మండలంలోని పోలవరం బీసీ వసతి గృహం విద్యార్థులు 40 మంది కలుషిత ఆహారం తీసుకుని అస్వస్థతకు గురయ్యారు. ఇందులో అధికారుల నిర్లక్ష్యం ఉందని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులు ఇలా చర్యలు తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు జిల్లా బీసీ కార్యాలయానికి చేరాయి.

పోర్టు పనులు వేగవంతం చేయాలి: జేసీ



ప్రీ వాల్యుయేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ నవీన్‌కుమార్, సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు

టెక్కలి: భావనపాడు పోర్టుకు సంబంధించి రోడ్డు, రైలు మార్గాల ప్రాథమిక పనులు వేగవంతం చేయాలని జేసీ ఎం.నవీన్‌కుమార్ ఆదేశించారు. భావనపాడు పోర్టు కోసం టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లో రోడ్డు, రైలు మార్గాల నిర్మాణానికి కేటాయించిన భూముల్లో జేసీ నవీన్‌కుమార్‌తో పాటు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు పీవీ(ప్రీ వాల్యుయేషన్) పరిశీలన చేశారు. భావనపాడు పోర్టుకు సంబంధించి రోడ్డు, రైలు మార్గాల కోసం గుర్తించిన భూముల రైతులతో మాట్లాడి పక్కాగా భూముల విలువను కట్టాలన్నారు. పోర్టు రోడ్డు కోసం టెక్కలి జాతీయ రహదారి నుంచి మోదుగువలస, బన్నువాడ, తలగాం, వేములవాడ, పాతనౌపడ, సంతబొమ్మాళి మండలంలో రాజపురం, ఇజ్జువరం, కస్పానౌపడ మీదుగా మూలపేట వరకు సుమారు 327.75 ఎకరాలను గుర్తించారు. అలాగే సంతబొమ్మాళి మండలం కోటపాడు, కాశీపురం, పోతునాయుడుపేట, యామాలపేట, కూర్మనాథపురం, రాజపురం మీదుగా రైల్వే మార్గానికి 428.02 ఎకరాల భూములను గుర్తించారు. ఈ సర్వేలో డీఐఓ ఎం.జనార్దనరావు, తహసీల్దారు కిశోర్‌తో పాటు సర్వేయర్లు ఉన్నారు.

అనుబంధ కాలేజీలకు గుర్తింపు తప్పనిసరి: వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు గుర్తింపు తప్పనిసరని విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ ఏడాదికి సంబంధించి అనుబంధ గుర్తింపు మే నెల చివరి నాటికి పూర్తిచేయాలని అన్నారు. మొదటి ఏడాది ప్రవేశాలకు ముందు గుర్తింపు సాధించాలని వివరించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిబంధనల మేరకు అర్హత ఉన్న కళాశాలలకు గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు పూర్తయ్యాక మూల్యాంకనం సకాలంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ విద్యలో ఇంటర్న్‌షిప్, సామాజిక అనుసంధాన కార్యక్రమాలు తప్పనిసరిగా అమలు చేయనున్నట్లు చెప్పారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ క్లాస్‌వర్క్ ఈ నెల 20 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గ్రేట్ రెస్క్యూ



7.41 రెస్క్యూ ఆపరేషన్ మొదలయ్యింది. అపార్ట్‌మెంట్ వెనుక భాగం నుంచి మూడో ఫ్లోర్‌కు వెళ్లి.. ఫైర్‌మెన్ పాపారావు ఇలా కిందకు దిగారు.



7.46 ఫైర్‌మెన్ సురక్షితంగా కిందకు దిగేందుకు తోటి సిబ్బంది ఇలా సహకరించారు.



7.50 రెండో ఫ్లోర్‌లోని వృద్ధుడి ఇంటికి ఇలా సురక్షితంగా చేరుకున్నారు.



7.55 ఇంట్లోకి చేరుకొని కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధుడిని పలకరించి ధైర్యం చెప్పారు. డాక్టరుకు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించారు.

● ఆ 20 నిమిషాల్లో..

అగ్నిమాపక శాఖ సిబ్బంది చేసిన 20 నిమిషాల రెస్క్యూ ఆపరేషన్ ఓ నిండు ప్రాణాన్ని కాపాడింది. శ్రీకాకుళంలో శుక్రవారం ఉదయం 7.35కు ఫైర్‌స్టేషన్‌కు ఓ ఫోన్ వచ్చింది. కొన్నావీధి మాధవ్ మోటార్స్ జంక్షన్‌లోని ఓ అపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నానంటూ ఓ వ్యక్తి కాల్ చేశారు. రెండో ఫ్లోర్‌లో 61 ఏళ్ల వృద్ధుడు సుబ్బారావు లోపల గడియ పెట్టి బయటకు రాలేకపోతున్నారని, సహాయం చేయాలని అభ్యర్థించారు. శ్రీకాకుళం కేంద్రాధికారి ఎం.వరప్రసాదరావు సిబ్బందిని అలెర్ట్ చేసి 20 నిమిషాల ఆపరేషన్‌తో 7.55కు ఆ వృద్ధుడిని బయటకు తీసుకువచ్చారు. వృద్ధుడు శీలం సుబ్బారావు డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్.. భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు, కుమార్తెలు జాబ్ చేసుకుంటూ బయట పట్టణాల్లో ఉన్నారు. భార్య వారం రోజుల కిందట క్యాంపునకు వెళ్లారు. అనారోగ్యం కారణంగా బాగా నీరసించిపోయి లోపల ఉండిపోయారు. – శ్రీకాకుళం క్రైమ్

క్లిక్ చేస్తే.. బుక్ అయినట్టే



సైబర్ అలర్ట్

- కరెంటు బిల్లు పెండింగ్ ఉందంటూ సెల్‌ఫోన్లకు ఫేక్ మెసేజ్‌లు
- క్లిక్ చేసినా.. వివరాలు చెప్పినా ఖాతాలో నగదు మాయం
- జాగ్రత్తగా ఉండాలంటున్న విద్యుత్ శాఖ

అరసవల్లి: 'మీ విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉంది. వెంటనే చెల్లించకపోతే.. మీటర్ డిస్‌కనెక్ట్ చేస్తాం' ఇలా ఓ సందేశం మీ ఫోన్‌కు వచ్చిందా. బిల్లు కట్టేశానే.. మెసేజ్ ఎందుకు వచ్చిందనే అనుమానంతో క్లిక్ చేసి వివరాలు నమోదు చేశారో.. మీ ఖాతా ఖాళీ అయిపోతుంది. ఆ నంబర్‌కు కాల్ చేసి మాట్లాడినా.. అదే జరుగుతుంది. జిల్లాలో కరెంటు బిల్లు పేరిట తాజాగా జరుగుతున్న మోసమిది. సైబర్ నేరాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా విద్యుత్ బిల్లుల విషయంలోనూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. దీంతో జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది.

పెరిగిన ఆన్‌లైన్ చెల్లింపులు



జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం ఎల్‌టీ విద్యుత్ వినియోగదారులు 9,15,848 మంది ఉండగా, హెచ్‌టీ వినియోగదారులు 473 మంది ఉన్నారు. ఈ వినియోగదారుల నుంచి నెలకు సుమారుగా రూ.85.83 కోట్లు బిల్లుల ద్వారా వసూలవుతాయి. వీటిలో సుమారు రూ.21.31 కోట్లు వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఇక హెచ్‌టీ వినియోగదారులంతా ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తుంటారు. కోవిడ్ తర్వాత ఆన్‌లైన్ చెల్లింపులు బాగా పెరిగాయి. ఈ పరిస్థితులను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అధికంగా ఎల్‌టీ విద్యుత్ వినియోగదారులనే టార్గెట్ చేసుకుని మెసేజ్‌ల రూపంలో వల వేస్తున్నారు. దీనిపై అవగాహన లేకపోవడంతో చాలామంది ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారు. పోలీసులను కూడా ఆశ్రయిస్తున్నారు. కొందరైతే విద్యుత్ శాఖాధికారులను సంప్రదిస్తున్నారు.

ఫేక్ మెసేజ్‌లు నమ్మవద్దు



మా సంస్థ నుంచి ఏ వినియోగదారునికి నంబర్‌తో కూడిన మెసేజ్‌లను పంపించే విధానం లేదు. బిల్లు కట్టాలని గానీ, గడువు తీరిందని గానీ, లేదంటే కనెక్షన్ కట్ చేస్తామని గానీ మా నుంచి ఎవ్వరికీ మెసేజ్‌లు రావు. జిల్లాలో పలువురికి ఫేక్ మెసేజీలు వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. ఎవరైనా ఇబ్బందులకు, మోసాలకు గురైతే ఫిర్యాదు చేయండి. సైబర్ నేరాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ మెసేజ్‌లను నమ్మొద్దు.


– ఎల్.దైవప్రసాద్, ఎస్ఈ, విద్యుత్ సర్కిల్

దోపిడీ ఇలా..



ఓ వ్యక్తి సెల్‌కు వచ్చిన ఫేక్ మెసేజ్ ఇది

విద్యుత్ వినియోగదారుల ఫోన్ నంబర్లతో కూడిన సర్వీసు నంబర్లను సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారు. వాటిలో అధిక వినియోగం చేసేవారిని గుర్తించి వారికి సెల్‌ఫోన్లకు మెసేజ్‌లను పంపుతున్నారు. 'మీ బిల్లు గడువు తీరిపోయిందని, వెంటనే చెల్లించాలని, లేదంటే కనెక్షన్ కట్ చేస్తున్నామని' హెచ్చరికలతో కూడి మెసేజ్‌లను పంపిస్తున్నారు. ఒక వేళ బిల్లు చెల్లించామని వినియోగదారుడు తిరిగి కాల్ చేసి చెప్తే వారి వివరాలతో పాటుగా యాప్‌లో అప్‌లోడ్ చేసేలా వెబ్ లింక్‌ను పంపి మోసం చేస్తున్నారు. ఆ వెబ్ లింక్ స్క్రీన్ షేరింగ్ యాప్‌కు సంబంధించినవి కావడంతో లింక్ క్లిక్ చేయగానే ఆటోమేటిక్‌గా యాప్స్ డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ అవుతాయి. వినియోగదారుని నుంచి సేకరించిన వివరాల ప్రకారం బ్యాంకు ఖాతాల్లో నగదును కొల్లగొడుతున్నారు.



తమను సంప్రదించాలంటూ నంబర్‌తో కూడిన మెసేజ్‌ని పంపిన దృశ్యం

పలాసలో రంగమ్మత్త

- లక్కీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన నటి అనసూయ



షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న అనసూయ



కాశీబుగ్గ: ప్రముఖ సినీ నటి, టీవీ యాంకర్ అనసూయ శుక్రవారం పలాస–కాశీబుగ్గలో సందడి చేశారు. ఇక్కడి కేటీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఆమెను చూసేందుకు వేలాదిగా జనం తరలి రావడంతో రోడ్డు కిక్కిరిసిపోయింది. తనకు పలాస రావాలని ఎప్పటి నుంచో ఉందని, లక్కీ షాపింగ్ మాల్ వారి వల్ల ఆ కోరిక నెరవేరిందన్నారు. మంచి ధరల్లో నాణ్యమైన వస్త్రాలు ఇక్కడ దొరుకుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని లక్కీ షాపింగ్ మాల్ ముగ్గురు డైరెక్టర్లు జి.శ్రీనివాసరావు, ఎస్.రత్తయ్య, జి.సోమయ్యలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భార్య సీదిరి శ్రీదేవి, మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం, మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, నాయకులు బోర బుజ్జి, మీసాల సురేష్‌బాబు, భవనం యాజమాన్యం కోరాడ శ్రీనివాస్, సంతోష్‌కుమార్, రవికుమార్, పివి సతీష్, మల్లా సురేష్, లొడగల కామేష్ పాల్గొన్నారు.

వేసవి నాటికి ఉద్దానంకు తాగునీరు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



హిరమండలంలో ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

హిరమండలం: ఉద్దానం తాగునీటి పథకం పనులు వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన శుక్రవారం వంశధార రిజర్వాయర్‌లో జరుగుతున్న ఉద్దానం తాగునీటి రక్షిత మంచి నీటి పథకం పనులను పరిశీలించారు. వంశధార రిజర్వాయర్‌లో నీటిని తోడేందుకు పంపు, ఫిల్టరేషన్, నీటిని తోడేందుకు యంత్రాలు, విద్యుత్ కనెక్షన్ ఇతర పనులను పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఎంత శాతం నీరు ఉంటే తాగునీరు అందివ్వగలమనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటిని విడుదల చేసే కార్యక్రమం పండగలా చేయాలన్నారు. ఎప్పటిలోగా ట్రైల్ రన్ వేసి నీటిని విడుదల చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారని సంబంధిత అధికారులను అడిగారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆశాలత మాట్లాడుతూ పాతపట్నం మండలంలో పైపులైన్ ఏర్పాటుకు ఇబ్బందులు ఉన్నాయని, అధికారుల సమన్వయ లోపమే ఇందుకు కారణమని తెలిపారు. అలాగే మందస మండలం హైవే వద్ద కూడా చిన్న సమస్య ఉందని, దాన్ని పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ఆ సమస్యలను పరిష్కరించే బాధ్యతను టెక్కలి సబ్ కలెక్టర్‌కు అప్పగిస్తానని తెలిపారు. వేసవి నాటికి నీరిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వంశధార రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. దీనికి అనుసంధానంగా ఉన్న ఎత్తిపోతల పథకం పనులు ఎంతవరకు ప్రారంభమయ్యాయో వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే జిల్లా అంతటా రెండు పంటలకు సాగునీరు అందించేందుకు వీలవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.



కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టీవీఎస్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జాన్ బెన్హర్, వంశధార డీఈ సురేష్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధనరావు, తహసీల్దార్ బి.మురళీమోహన్ రావు తదితరులు ఉన్నారు.

డబ్బు కోసం అడ్డదారులు..

- వివాహిత ఫొటోలు మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన యువకులు
- చాకచక్యంగా పట్టుకున్న నరసన్నపేట పోలీసులు



కేసు వివరాలను విలేకరులకు తెలియజేస్తున్న సీఐ రాము

నరసన్నపేట: సులువుగా డబ్బులు సంపాదించాలని ఆ యువకులు అడ్డదారులు తొక్కారు. వివాహిత ఫొటోలు మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. ఆఖరకు పోలీసుల వలలో చిక్కుకుని ఊచలు లెక్క పెడుతున్నారు. నరసన్నపేట సీఐ డి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నానుబాలవీధికి చెందిన బూసి శ్రీనివాసరావు, ఇలీసుపురం వద్ద తిలక్ నగర్‌కు చెందిన గొనప ఆకాశ్, పొందూరు మండలం కింతలికి చెందిన పైడి లోహిత్‌లు స్నేహితులు. సులువుగా ఎక్కువ డబ్బులు సంపాదించాలని కొందరు వివాహితల ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆ ఫొటోలు వారికి పంపించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలాకి మండలం దీర్ఘాశిలోని ఓ టీచర్ భార్య ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆ టీచర్‌కు, ఆయన భార్యకు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని, లేదంటే ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. ఆ టీచర్ నరసన్నపేట సీఐ రామును ఆశ్రయించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి యువకులను పట్టుకోవడానికి ప్లాన్ వేశారు. వారు డిమాండ్ చేసినట్టుగానే డబ్బులు ఇస్తామని టీచర్ చేత చెప్పించి ఆ యువకులను ఈ నెల 15న నరసన్నపేటకు రప్పించారు. టీచర్ డబ్బులు ఇస్తుండగా యువకులను అక్కడే పట్టుకున్నారు. అనంతరం వారిని విచారించగా.. సులువు గా డబ్బులు సంపాదించవచ్చని ఇలా చేస్తున్నామని ఒప్పుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన సుగుణ, ముత్యాల శ్రీకాంత్‌లు ఇందులో కీలక సూత్రధారుల ని చెప్పారు. వీరిద్దరి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. పోలీసులకు దొరికిపోయిన పైడి లోహిత్, బూసి శ్రీనివాసరావు, గొనప ఆకాశ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



శ్రీకాకుళంలో ఓ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న ఫస్టియర్ విద్యార్థులు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా సాగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం ఫస్టియర్ విద్యార్థులు సెట్–3 ప్రశ్నపత్రంతో ఇంగ్లీషు పేపర్–1 పేపర్‌కు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు శుక్రవారం మొత్తం 28,973 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా (95.05 శాతం హాజరు) 27,539 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 1434 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 26,407 మందికి 1264, ఒకేషనల్ విభాగంలో 2566 మందికి 170 మంది విద్యార్థులు హాజరు కాలేదు. జిల్లా పరిశీలకులు/డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ కమిటీ, హైపవర్ కమిటీ, కస్టోడియన్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వేరువేరుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలను చేపడుతున్నారు. ముఖ్యంగా 17 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గోవిందపురం, కింతలి, తొగరాం, ఎల్ఎన్‌పేట, జి.సిగడాం, కొయ్యాం, హిరమండలం, ప్రియాగ్రహారం, వంగర, సంతకవిటి, సారవకోట తదితర కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు కేసులు నమోదుకాలేదని అధికారులు తెలిపారు. శనివారం సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లీషు పేపర్–2 పరీక్ష జరగనుంది.

నాయీ బ్రాహ్మణులకు కనీస వేతన జీఓపై హర్షం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సూర్యనారాయణ తదితరులు

అరసవల్లి: దేవాలయాల కేశఖండన శాలల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు నెలకు కనీస వేతనంగా రూ.20 వేల ఆదాయాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ నాయీబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం అరసవల్లి కేశఖండనశాల వద్ద రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘ నేత ముంగండి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయీబ్రాహ్మణులంతా కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, ఇటీవలే రాష్ట్రంలో అన్ని ప్రముఖ ఆలయాల్లో ఆలయ ధర్మకర్తలుగా కూడా తమ సామాజిక వర్గానికి అవకాశం కల్పించారని, ఇప్పుడు ఏకంగా కనీస ఆదాయంగా రూ.20 వేలు వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గొప్ప విశేషమన్నారు.

నాయీబ్రాహ్మణులంతా సీఎం జగన్‌కు శాశ్వతంగా రుణపడి ఉంటారని తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ సంఘ అధ్యక్షుడు గులిమి సింహాచలం, ఉపాధ్యక్షుడు పాపారావు, కృష్ణప్రసాద్ తదితరులతో పాటు అరసవల్లి ఆలయ కేశఖండన శాల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వందశాతం ఫలితాలు సాధించాలి: డీఈఓ



ఎంఈవో, సీఆర్‌పీలతో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

రణస్థలం: పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి వందశాతం ఫలితాలు సాధించాలని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. మండలంలోని ఎంఈఓ కార్యాలయాన్ని, జీరుపాలెం హైస్కూల్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ఉపాధ్యాయులు చూసుకోవాలన్నారు. వెనుకబడిన వారిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలన్నారు. జీరుపాలెం హైస్కూల్‌కు నాడు-నేడు ఫేజ్-2లో మంజూరైన భవనాలకు స్థలం లేకపోవడంతో ఆమె స్వయంగా పరిశీలించేందుకు వచ్చారు. స్థల పరిశీలన వేగవంతం చేయకపోతే నాడు-నేడులో వచ్చిన భవనాల నిధులు వెనక్కు వెళ్లిపోతాయని, త్వరితగతిన స్థలం కేటాయింపులు జరిగేలా రెవెన్యూ అధికారులతో మాట్లాడాలని ఎంఈఓ త్రినాథరావును ఆదేశించారు. కార్యక్రమంలో జీరుపాలెం హెచ్‌ఎం జీ.రామారావు, సీఆర్‌పీలు ఉన్నారు.

సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఫార్మసిస్ట్‌గా సోమేశ్వరరావు



సోమేశ్వరరావును అభినందిస్తున్న ఫార్మసిస్ట్‌ల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌లో ఫార్మసిస్ట్‌గా గుంట సోమేశ్వరరావు శుక్రవారం విధుల్లో చేరారు. గతంలో రెంటికోట పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా పనిచేసిన సోమేశ్వరరావు బదిలీపై శ్రీకాకుళం సెంట్రల్ డ్రగ్‌స్టోర్స్‌కు వచ్చారు. సోమేశ్వరరావు తన జాయినింగ్ రిపోర్ట్‌ను సెంట్రల్ డ్రగ్‌స్టోర్ ఇంజినీర్ బీఎస్ ప్రసాద్‌కు అందజేశారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందుల కొరత లేకుండా చూసుకుంటానని, కాలం చెల్లిన మందులను ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫార్మసిస్ట్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బమ్మిడి నరసింగరావు, కార్యదర్శి చక్రవర్తి, సభ్యులు ఎస్‌వి నరసింహ, విజయానంద్, మల్లేష్ తదితరులు సోమేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

టీచర్ అరాచకం

- విద్యార్థినిని దారుణంగా కొట్టిన ఉపాధ్యాయురాలు



విద్యార్థిని వీపుపై బెత్తంతో కొట్టిన గాయాలు

ఇచ్ఛాపురం రూరల్: ఆడ పిల్లలకు విద్యారంగంలో మరింతగా ప్రోత్సహించి, ధైర్యంగా ఉండాల్సిన ఉపాధ్యాయురాలు విచక్షణ కోల్పోయి ఉన్మాదిగా మారింది. మార్కులు తక్కువ వచ్చాయనే కారణంతో బాలికను దారుణంగా కొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. ఇచ్ఛాపురం మండలం బొడ్డఖాళీ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన లండ లయ నాలుగో తరగతి చదువుతోంది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో లయకు తక్కువ మార్కులు వచ్చాయనే కారణంతో ఉపాధ్యాయురాలు జి.లలిత ఆగ్రహంతో ఊగిపోయింది. బెత్తంతో వీపుపై ఇష్టానుసారంగా కొట్టడంతో విద్యార్థిని తీవ్రగాయాలపాలయ్యింది. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చిన బాలిక జ్వరంతో బాధపడుతూ తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇచ్ఛాపురం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందజేశారు. ఘటనపై మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావుకు వివరణ కోరగా శనివారం పాఠశాలకు వెళ్లి దర్యాప్తు చేపడతామని తెలియజేశారు. ఉన్నతాధికారులకు వివరించి సంబంధిత ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	56,150-00
బంగారం(22కే. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

గురుకులం పిలుస్తోంది

- గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు 24 వరకు గడువు



గ్రేస్, కోఆర్డినేటర్, శ్రీకాకుళం.

జిల్లాలోని గురుకుల పాఠశాలల ఫోన్ నంబర్లు		
దుప్పలవలస గురుకులం	బాలురు	9704550004
కంచిలి	బాలురు	9704550005
ఎచ్చెర్ల	బాలికలు	9704550006
పెద్దపాడు	బాలికలు	9704550007
నందిగాం	బాలికలు	9704550008
కొల్లివలస	బాలురు	9949356321
తామరాపల్లి	బాలికలు	9704550010
మందస	బాలికలు	9704550012
పాతపట్నం	బాలికలు	9676488008

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023-2024 విద్యా సంవత్సరానికి 5 వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ గ్రేసీ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతి కోసం హెచ్‌టీటీపీ:ఏపీజీపీసీఈటీ.ఇన్ ద్వారా, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కోసం హెచ్‌టీటీపీ:ఏపీజీపీసిఈటీ.ఏపీసిఎఫ్ఎస్ఎస్.ఇన్/ ఇంటర్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలురు, బాలికలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారి మార్కుల ఆధారంగా వారికి సీట్లు కేటాయిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉంటుందని తెలిపారు. 5వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్‌కి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశానికి..

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-09-2010 నుంచి 31-08-2014 మధ్య జన్మించిన వారై ఉండాలి, ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియ విద్యార్థులు 1-09-2012 నుంచి 31-08-2014 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు.
- విద్యార్థులు సొంత జిల్లాలో మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- సంబంధిత జిల్లాలో 2021-2022 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2022-2023 విద్యాసంవత్సరంలో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి.
- అభ్యర్థి కుటుంబ వార్షికాదాయం రూ. 1,00,000కు మించి ఉండరాదు.
- 5వ తరగతి, ఇంటర్‌కు అన్ని గురుకుల విద్యాలయాల్లో ఎస్సీలకు 75%, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్-12%, ఎస్టీ 6%, బీసీ:-5% ఇతరులకు 2% సీట్లు కేటాయిస్తారు.

మహిళలు ధైర్యంగా వ్యవహరించాలి



లక్ష్మీపార్వతిని సన్మానిస్తున్న సాహిత్య సాంస్కృతిక సమాఖ్య, అభ్యుదయ రచయితల సంఘం, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

- తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి

టెక్కలి: ఓ వైపు మహిళలు అంతరిక్షం వైపు దూసుకెళ్తుంటే.. మరోవైపు కొందరు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇలాంటి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలని తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వపు విద్యార్థుల సౌజన్యంతో 'సాహిత్యంలో మహిళ' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన జాతీయ సెమినార్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో లక్ష్మీపార్వతిని విద్యార్థులంతా సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సెమినార్‌లో లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో కంటే సాహిత్య రంగంలో మహిళలు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. మహిళలు శతశాతం విద్యాభివృద్ధి సాధించాలన్నారు. ఎన్‌టీఆర్, వైఎస్సార్ తర్వాత ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సాధికారత, విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ హయాంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఎంతో మంది ఉన్నత విద్యనభ్యసించారని పేర్కొన్నారు. ఇప్పుడు విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయని, ముఖ్యంగా మహిళల విద్యా సాధికారతకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు.

అనంతరం అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ఎస్.వెంకటరావు మాట్లాడుతూ ఒక కుటుంబంలో మహిళ విద్యావేత్తగా మారితే ఆ కుటుంబం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా టెక్కలికి చెందిన సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు జీవీ రెడ్డి మాస్టారు, బి.అయ్యబాబు తదితరులు లక్ష్మీపార్వతిని సన్మానించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి ఫ్రెడరిక్ వీరగున్నమ్మ చరిత్ర పుస్తకాన్ని లక్ష్మీపార్వతికి అందజేశారు. కార్యక్రమంలో రచయిత ఎం.ఎస్.వి.గంగరాజు, ఏయూ తెలుగు అధ్యాపకురాలు ఎ.సీతారత్నం, వివిధ యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు ఎస్.కమలాకర్‌శర్మ, పఠాన్ ఖాసింఖాన్, ఎస్‌వీవీఎస్ నారాయణరాజు, చంద్రశేఖర్ దాస్, సూర్యచంద్ర, విజయభారతి, రాజామాణిక్యం, బి.సతీష్‌కుమార్, ల్యూక్‌పాల్, లీలాపద్మజ, బి.యూన్సీరాణి, జగన్నాథ్ బిసై, కె.గొల్ల, జి.కసవయ్య, వి.తిరుల మరావు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో మహిళలది గొప్ప పాత్ర

సాహిత్య రంగంలో మహిళలది గొప్ప పాత్ర అని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సాహిత్యంలో మహిళ జాతీయ స్థాయి సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాహిత్య రంగంలో మహిళలు చేసిన సేవలను ఆయన కొనియాడారు.

జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ

నరసన్నపేట: స్థానిక జీసీ హోమ్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ ప్రారంభించారు. శ్రీ మిత్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగదీష్ మెమోరియల్ పేరున ఈ షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా.. ఇందులో 50 జట్లు పాల్గొంటున్నాయి. టోర్నమెంట్ సజావుగా నిర్వహించాలని, క్రీడాకారులు అందరూ సహకరించి విజయవంతం చేయాలని పద్మప్రియ కోరారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో టోర్నమెంట్ జరుగుతుండగా 19న ఫైనల్ నిర్వహిస్తామని, గెలిచిన వారికి ట్రోఫీతో పాటు నగదు బహుమతి ఇస్తామని టోర్నమెంట్ నిర్వహణ కమిటీ ప్రతినిధి పెదిరెడ్ల రాము తెలిపారు.

కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుప్త, దాలినాయుడు, వైశ్యరాజు కేశవరాజు, గనగళ్ల శ్రీను, కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20న సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. వర్సిటీలో ఆయన వివరాలు వెల్లడించారు. సీఎస్‌ఈ, ఈసీఈ, మెకానికల్, ట్రిపుల్‌ఈ, సివిల్ బ్రాంచ్‌లకు సంబంధించి అవసరం మేరకు సబ్జెక్టు కాంట్రాక్టు సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. ఎంటెక్‌లో 55 శాతం మార్కులు తప్పనిసరని తెలిపారు. 20న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, సబ్జెక్టు నిపుణులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని అన్నారు. దరఖాస్తులను వర్సిటీ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏయూ.ఈడీయూ.ఇన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ సందర్శించాలని అన్నారు.

23న మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని మహాత్మా జ్యోతీరావు పూలే న్యాయ కళాశాలలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్లు (తక్షణ ప్రవేశాలు) నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు చెప్పారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు సాధించటంతో ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి అనుమతులు మంజూరు చేసిందని అన్నారు. ప్రవేశాలకు లాసెట్- 2023లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులుగా చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏయూ.ఈడీయు.ఇన్/ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. లాసెట్ నిబంధనల మేరకు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. స్పాట్ ప్రవేశాల దరఖాస్తు రుసుం రూ. వెయ్యిగా చెప్పారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని అన్నారు.

గేట్‌లో అదరగొట్టిన సిక్కోలు కుర్రాళ్లు



వంశీకృష్ణకు మిఠాయి తినిపిస్తూ అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి

ఆమదాలవలస: గేట్ పరీక్ష ఫలితాల్లో ఆమదాలవలసకు చెందిన బస్వా వంశీకృష్ణ ఆల్ ఇండియా 64వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా వంశీకృష్ణకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శుక్రవారం మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు. వంశీకృష్ణ 1 నుంచి 7వ తరగతి వరకు ఆశోక పబ్లిక్ స్కూల్‌లో, 8 నుంచి 10వ తరగతివరకు భాష్యంలో చదివాడు. ఇంటర్ శ్రీచైతన్యలో, బీటెక్ విశాఖలో పూర్తి చేశాడు. గోవా నిట్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ ర్యాంకు పొందినందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి శుభాకాంక్షలు తెలిపారు.

మెరిసిన నవీన్



వరదా నవీన్

శ్రీకాకుళం న్యూకాలనీ: గేట్-2023 ప్రవేశ పరీక్షలో శ్రీకాకుళం నగరానికి చెందిన వరదా నవీన్ మెరిశాడు. తాజాగా వెలువడిన గేట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 181వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించాడు. మొత్తం 771 మార్కులు సాధించి సత్తాచాటాడు. నవీన్ తల్లిదండ్రులు వరదా వెంకటరమణ, అరుణకుమారిలు శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న కుందనపుపేటలో నివాసం ఉంటున్నారు. నవీన్ తండ్రి చిత్తరంజన్ వీధిలో ఉన్న నవీన్ మెడికల్ ఏజెన్సీ హోల్‌సేల్ మందుల షాపును నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి. శ్రీకాకుళం గాయత్రి స్కూల్‌లో చదువుకుని పదో తరగతిలో 10/10తో ఉత్తీర్ణత సాధించిన నవీన్ ఇంటర్మీడియెట్‌ను శ్రీకాకుళం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. అనంతరం హైదరాబాద్‌లో ఉన్న ఐఐటీలో 9.39 సీజీపీఏతో బీటెక్ పూర్తిచేశాడు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. గేట్ ఫలితాల్లో తనకు 181వ ర్యాంకు రావడంపై నవీన్ సంతోషం వ్యక్తంచేశాడు.

రైలు పట్టాలు పక్కన మృతదేహం



లొద్దపుట్టి ఎల్‌సీ గేట్ సమీపంలో రైలు పట్టాలు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి ఎల్‌సీ గేట్ సమీపంలోని రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి ఒంటిపై నిక్కరు, గళ్ల టీ షర్టు ఉన్నాయి. రైలు ద్వారం వద్ద కూర్చుని కింద పడిపోయి ఉంటాడని, వయసు దాదాపు 56 ఏళ్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఈ విషయాన్ని ఎల్‌సీ గేట్ మెన్ పలాస జీఆర్పీ పోలీసులకు చెప్పగా వారు 11 గంటలకు అక్కడకు వచ్చారు. అయితే పోలీసులు వచ్చే సరికి మృతదేహం లేకపోవడం గమనార్హం. దీంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు.

పెద్దమురహరిపురంలో పిడుగుపాటు



వజ్రపుకొత్తూరు: పీఎంపురంలో మృతి చెందిన ఆవు



సోంపేట: పిడుగు పడి మృతి చెందిన ఆవుతో రైతు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురంలో గురువారం రాత్రి పిడుగు పడింది. ఈ పిడుగుపాటుకు కలిశెట్టి లక్ష్మికి చెందిన ఆవు మృతి చెందింది. ఆవు దూడకు గాయాలయ్యాయి. ఆవుకు పశువుల బీమా పథకం ఉన్నందున ఆ శాఖ అధికారులు పరిశీలించి తక్షణమే ఆదుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కె.గోపాల్, సచివాలయ కన్వీనర్ జి.రామారావు కోరారు.

గొల్లూరులో..

సోంపేట: మండలంలోని గొల్లూరులో శుక్రవారం పిడుగు పడింది. దీంతో రాపాక శేషగిరికి చెందిన సూడి ఆవు చనిపోయింది. పశువైద్య సిబ్బంది ఆవును పరిశీలించి ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందించడానికి కృషిచేస్తామని రైతుకు తెలిపారు.

ఫోను వదులు.. ముందుకు కదులు!



హర్ష్ పండిట్‌ను కలిసి అభినందిస్తున్న స్థానికులు

కంచిలి: యువత సెల్‌ఫోన్ వాడకం తగ్గించి, ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టాలని కోరుతూ బీహార్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు హర్ష్ పండిట్ 6వేల కిలోమీటర్ల పరుగు యాత్ర మొదలుపెట్టాడు. శుక్రవారం అతను కంచిలి మండలానికి చేరుకున్నాడు. జాడుపూడి వద్ద జాతీయ రహదారిపై విలేకరులతో మాట్లాడాడు. యువతకు ఫిట్‌నెస్‌పై ప్రేరణ కలిగించేందుకు దేశంలో ఐదు మహానగరాల మధ్య 6వేల కిలోమీటర్లు పరుగు యాత్ర జనవరి ఒకటో తేదీన ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద యాత్రను ప్రారంభించాడు. ఢిల్లీ నుంచి బయలుదేరిన ఈ పరుగు యాత్ర ముంబై, చెన్నై, కోల్‌కత్తా నగరాల మీదుగా మళ్లీ ఢిల్లీ చేరుకుంటుంది. గతంలో 900 కిలోమీటర్ల పాటు పరుగు యాత్ర చేసి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో చోటు సంపాదించానని హర్ష్ పండిట్ చెప్పాడు.

ఈసారి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించే లక్ష్యంతో 6వేల కిలోమీటర్ల పరుగు యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. తనతోపాటు తన తండ్రి హిమాషన్, మిగతా బృందం ఉన్నారు. ఈ సందర్భంగా హర్ష్ పండిట్‌ను స్థానికులు కలిసి అభినందించారు.


ఉత్తమ సహకార సంఘాల సందర్శన



అరసవల్లి డీసీఎంఎస్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న బృందం

శ్రీకాకుళం అర్బన్: లేబర్స్ కాంట్రాక్ట్ సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు శుక్రవారం ఉత్తమ సహకార సంఘాలను సందర్శిస్తున్నారు. శ్రీకాకుళంలోని అరసవల్లిలో గల డీసీఎంఎస్‌ను సందర్శించిన బృందానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్, బిజినెస్ మేనేజర్ లక్ష్మణరావు స్వాగతం పలికి ఇక్కడ పనులను వివరించారు. అనంతరం రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి పరచడానికి, నాయకత్వ అభివృద్ధి ముఖ్యమన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లేబర్స్ కాంట్రాక్ట్ సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గానికి మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో జిల్లాలో పలు సంఘాల పాలకవర్గ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. అలాగే శనివారం నుంచి శ్రీకాకుళంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో మూడు రోజుల పాటు మత్స్యకార సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు నాయకత్వ అభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

శూలాయుధాలతో ఊరేగింపు



ఊరేగింపులో శూలాయుధాలు గుచ్చుకున్న చిన్నారులు



శూలాయుధాలతో ఊరేగింపు



వంటినిండా శూలాలు గుచ్చుకున్న యువకుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దరెల్లివీధికి చెందిన పలువురు భక్తులు నూకాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. శూలాయుధాలతో ఊరేగింపు నిర్వహించారు. నక్కవీధి వద్ద వేంచేసిన నూకాలమ్మతల్లి ఆలయం వరకు ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో వచ్చారు. ఈ ఊరేగింపులో చిన్నారులు, పెద్దలు, యువకులు మొక్కుల కోసం శూలాలను గుచ్చుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద అగ్ని గుండం తొక్కి మొక్కులు సమర్పించుకున్నారు.